

మాదకద్రవ్యాల వినియోగం, ప్రకృతి వైపరీత్యాలు, లింగవివక్షపై నిర్వహించిన సదస్సులో విద్యార్థులు, నార్కొటిక్ పోలీసులు

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

హయత్‌నగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం, ప్రకృతి వైపరీత్యాలు, లింగవివక్ష అంశాలపై సోమవారం లక్ష్మారెడ్డిపాలెంలోని డిస్కవరీ ఓక్స్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో టీమ్ సభ్యులు రాచకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌లు శ్రీనివాసరావు, కె. ప్రవీణ్‌కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ వీ. జీవన్‌రెడ్డిలు హాజరయ్యారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు ఏవిధంగా ఆకర్షితులవుతున్నారు. వారి జీవితాలను ఎలా నాశనం చేసుకుంటున్నారు. నియంత్రణ ఎలా కోల్పోతున్నారనే విషయాలను వీడియో రూపంలో ప్రదర్శించారు. జాతీయ స్థాయిలో నషాముక్త్ భారత్, రాష్ట్ర స్థాయిలో మిషన్ పరివర్తన ద్వారా ఎలా కృషి చేస్తున్నారో విద్యార్థులకు వివరించడం జరిగింది. ఎక్కడైన మాదక ద్రవ్యాలు కనిపించినా ఎవరైన వాడినా ఆ సమాచారాన్ని ఫోన్ నంబర్- 8712671111కు అందించాలని కోరారు. మాదకద్రవ్యాలపై నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వారు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సారా అంజుమ్, కో-ఆర్డినేటర్ సాగరిక, సూర్యప్రకాష్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో వివిధ పనులను మంగళవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఉదయం 10 గంటలకు అబ్దుల్లాపూర్‌మెట్, అనంతరం బాటసింగారం, ఇనాంగూడ, లష్కర్‌గూడ, కవాడిపల్లి, తారామతిపేట, గౌరెల్లి, కుత్బుల్లాపూర్ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే చేతుల మీదుగా వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు చేయనున్నారు.



నూతన అధ్యక్షుడు శ్రీకరం శ్రీనివాస్‌ను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

కరన్‌బాగ్‌కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

సైదాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కరన్‌బాగ్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా మాల్యాద్రి శ్రీకరం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా రాజనర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్, కోశాధికారిగా శ్రీకాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా భరత్‌రెడ్డి, కార్యనిర్వహక కార్యదర్శిగా సాయికృష్ణ, కార్యవర్గసభ్యులుగా శ్రీహరి, వసంతరావు, శరత్‌కుమార్, రవిచంద్ర, విజయకుమార్‌గుప్తా, వేణుగోపాల్‌రావు, శ్రీరాం, జమీల్, విజేత, మలాతమ్మ, లక్ష్మీకుమారి నియమితులయ్యారు. నూతన అధ్యక్షుడిని కమిటీ సభ్యులు సన్మానించారు.

భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

వనస్థలిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురంలోని ప్రసిద్ధ శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన గౌరవ అధ్యక్షుడిగా కరిణే శాంతప్ప, అధ్యక్షుడిగా దీపావళి శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎస్.ఎం అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బీ.రవికుమార్, కోశాధికారిగా చౌదరి దివాకర్ లింగం, కార్యవర్గ సభ్యులుగా కుశాల్‌కుమార్, గణేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి కృషి చేసిన ఆలయ కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



కమిటీ చైర్మన్ హరిబాబును అభినందిస్తున్న రవికుమార్ తదితరులు

రామచంద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా హరిబాబు

చాదర్‌ఘాట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేటలోని శ్రీరామచంద్ర స్వామి ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు కమిటీని దేవాదాయ ధర్మాదాయ ఈవో మార్తాండ, ఇన్‌స్పెక్టర్ ఇందిర సోమవారం ప్రకటించారు. దేవాలయ నూతన ట్రస్ట్ బోర్డు కమిటీ చైర్మన్‌గా సీ.హరిబాబును ఎన్నుకున్నారు. ట్రస్టీలుగా జె.బాలకృష్ణ, ఎ.అన్నయ్య, ఎం.రాజేష్, శీలం ఉమారాణిలు ఎన్నికయ్యారు. దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తానని హరిబాబు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ చైర్మన్ ఏనుగుల చౌకి రవికుమార్ పటేల్, టీ.నరేందర్ ముదిరాజ్, చీపురు రాజారావుగౌడ్, పొల్కం శ్రీనివాస్, చౌకి రాజు, రామకృష్ణ, టిన్నుసింగ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ మురుగు ఇరిగేషన్ నాలాలో కలవకుండా చర్యలు తీసుకోండి: ఎంపీటీసీ

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 1(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ మురుగు నీరు ఇరిగేషన్ నాలాలో కలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇరిగేషన్ ఎస్ఈ హైదర్‌ఖాన్‌ను తారామతిపేట ఎంపీటీసీ చేగూరి వెంకటేశ్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లి ఆయన వినతిపత్రం సమర్పించారు. జీహెచ్ఎంసీ నుంచి వస్తున్న డ్రైనేజీ మురుగునీరు ఇరిగేషన్ నాలాలో కలపడంతో నేరుగా తారామతిపేట చెరువులోకి వస్తోందని తెలిపారు. దీంతో చెరువుతో పాటు భూగర్భ జలాలు పూర్తిగా కలుషితం అయినట్లు పేర్కొన్నారు. మురుగునీటి ద్వారా దోమల బెడద పెరిగి గ్రామస్థులు అనారోగ్యం పాలవుతున్నారని వివరించారు. డ్రైనేజీ మురుగు నేరుగా మూసీ కాల్వలో కలిసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

హత్య కేసులో ముగ్గురికి జీవితఖైదు

కూకట్‌పల్లి: రియల్ ఎస్టేట్ లావాదేవీల్లో తలెత్తిన వివాదంలో ఓ వ్యక్తిని ముగ్గురు కలిసి హత్య చేసిన ఉదంతంలో నిందితులను దోషులుగా నిర్ధారిస్తూ కూకట్‌పల్లిలోని 6వ ఏడీజే కోర్టు సోమవారం తీర్పు ఇచ్చింది. దోషులకు జీవిత ఖైదు విధించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జస్టిస్ సి.పావని తీర్పు విడుదల చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగపూరి నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్‌లోని దమ్మర పోచంపల్లిలో నివాసముండే మహ్మద్ ముజాహిద్(50), యూసఫ్‌గూడలోని ప్రభాత్‌నగర్‌లో నివాసముండే మహ్మద్ జిలానీ (25), రాజేంద్రనగర్‌లోని జిన్నారం కాలనీకు చెందిన మహ్మద్ ఫిరోజ్‌ఖాన్(31) లు ముగ్గురు స్నేహితులు. నవాబ్‌సాబ్‌కుంటలోని బచారత్‌నగర్‌కు చెందిన ఇస్మాయిల్(38) ఓ కేసులో జైలుకు వెళ్లడంతో అక్కడ ఈ ముగ్గురితో పరిచయం ఏర్పడింది. నలుగురు జైలు నుంచి బయటకు వచ్చాక రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. కొద్ది రోజులకే వ్యాపార లావాదేవీల్లో గొడవలు తలెత్తాయి. ఈనేపథ్యంలోనే 2022 జూలై 31న రాత్రి ఇస్మాయిల్‌ను ముజాహిద్, జిలానీ, ఫిరోజ్‌ఖాన్‌లు మాసబ్ ట్యాంక్ వద్దకు రమ్మని చెప్పడంతో వెళ్లాడు. లావాదేవీల విషయం మాట్లాడుతుండగానే జిలానీ తన వద్ద ఉన్న గన్‌తో ఇస్మాయిల్ తలపై కాల్చాడు. అడ్డుకోబోయిన జహంగీర్, అక్రం, గౌస్‌పాషాలపై కూడా దాడి చేసి గాయపర్చారు. ఇస్మాయిల్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమేరకు హత్య మారణాయుధాల అక్రమ వినియోగంపై కేసు నమోదు చేసుకొన్న మాదాపూర్ పోలీసులు నిందితులను కోర్టులో హాజరు పర్చి, చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన కోర్టు ముజాహిద్, జిలానీ, ఫిరోజ్‌ఖాన్‌లను దోషులుగా నిర్ధారిస్తూ జీవితఖైదు విధించింది.

గుట్టుగా సాగుతున్న గ్యాస్ సిలిండర్ల దందా..

- పట్టించుకునేవారు కరువు!
- టిఫిన్ సెంటర్లలో దర్శనమిస్తున్న సబ్సిడీ సిలిండర్లు
- మినీ గ్యాస్ ఏజెన్సీగా కిరాణ దుకాణం



చంపాపేటలోని ఓ కిరాణ దుకాణం ముందు ఆగిఉన్న సిలిండర్లు సరఫరా చేసే ఆటో

చంపాపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సామాన్యుడు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే మూడు నుంచి వారం రోజులు పట్టవచ్చు.. అప్పటికీ సిలిండర్ రాకపోతే సంబంధిత ఏజెన్సీలకు ఫోన్ ద్వారా రిక్వెస్ట్ చేసుకోవాలి.. అదే టిఫిన్ సెంటర్ లేదా దందా చేసుకునే కిరాణం దుకాణదారులకు సిలిండర్లు సరఫరా చేసే ఆటో వాళ్లు ఫోన్ చేసి ఈ రోజు ఎన్ని సిలిండర్లు కావాలని రిక్వెస్ట్ చేస్తుండటం ఇప్పుడు పరిపాటిగా మారింది. చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలోని పలు టిఫిన్ సెంటర్లు, కిరాణ దుకాణాలకు గుట్టు చప్పుడు కాకుండా సబ్సిడీ సిలిండర్లను యథేచ్ఛగా గ్యాస్ ఏజెన్సీల ద్వారా సరఫరా అవుతున్నా పట్టించుకునేవారు కరువైనారు. కాసులకు కక్కుర్తిపడి ఆటోలలో సరఫరా చేసే సిబ్బంది కంపెనీలు ఏవైనా సరే అడిగిన వారికి సిలిండర్లు మాత్రం అందిస్తూ సంపాదించుకుంటున్నారు. సిలిండర్‌కు వంద నుంచి మూడు వందల వరకు అధికంగా వసూళ్లు చేస్తూ దందా చేస్తున్నారు. డొమస్టిక్ సిలిండర్‌కు అధిక ధర చెల్లించే దానికంటే సబ్సిడీ సిలిండర్‌కు వంద, రెండొందలు అధికంగా ఇస్తే కాలం గడుస్తుందనే ఆశతో టిఫిన్ సెంటర్ల యజమానులు గ్యాస్ ఏజెన్సీ ఆటో సిబ్బందితో చేతులు కలుపుతున్నారు.

చంపాపేటలోని కిరాణా దుకాణంలో..

చంపాపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని ఓ కిరాణ దుకాణానికి ప్రతి రోజు పదుల సంఖ్యలో వివిధ గ్యాస్ ఏజెన్సీల ఆటోల సిబ్బంది సబ్సిడీ సిలిండర్లను సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. దుకాణదారుడు మాత్రం చిన్న సిలిండర్లలోకి గ్యాస్‌ను నింపి డబ్బులు దండుకోవడం, నేరుగా కష్టమర్లకు పెద్ద సిలిండర్లను విక్రయించడం కనిపిస్తున్నా పట్టించుకునే వారు మాత్రం కంటికి కనిపించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదమని తెలిసినా దుకాణంలోనే పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌లోకి రీఫిల్లింగ్ చేస్తుండడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయపడి ఎవరికి చెప్పుకోలేకపోతున్నారు. కిరాణ దుకాణం ఈ ప్రాంతంలో మినీ గ్యాస్ ఏజెన్సీగా మారింది. ఇకనైనా పౌర సరఫరాల శాఖ అధికారులు కళ్లు తెరిచి అక్రమ సిలిండర్ల దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పౌరసరఫరాల శాఖ ఏఎస్‌ఓ బాలసరోజను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులో లేరని సమాధానం వచ్చింది.

సబితారెడ్డి కాంగ్రెస్‌లోకి రావద్దంటూ నిరసన



సబితారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వనస్థలిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): తన స్వార్థం కోసం తల్లిలాంటి కాంగ్రెస్ పార్టీని వదిలి సీఎల్పీని టీఆర్ఎస్‌లో విలీనం చేయడంలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యే సబితా రెడ్డి అధికార దాహంతో తిరిగి కాంగ్రెస్‌లోకి రావడానికి ప్రయత్నించడం సహించరానిదని ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సబితారెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్న సమాచారంతో ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల పార్టీ ఆధ్వర్యంలో కొత్తపేట చౌరస్తాలో సబితారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 2018 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీపై గెలిచిన 12మంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడానికి ముఖ్య పాత్ర పోషించిన సబితారెడ్డి తన రాజకీయ స్వార్థం, అధికార దాహంతో తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌లో ఉండి ఎంతో అభివృద్ధి చెందిన ఆమె కష్టకాలంలో ఉన్న పార్టీని కాపాడుకోవాల్సింది పోయి, తల్లి లాంటి పార్టీని వదిలిపెట్టి టీఆర్ఎస్‌లోకి వెళ్లడం క్షమించరానిదన్నారు. తన అధికార దర్పంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను నానా ఇబ్బందులకు గురి చేసి అడుగడుగునా అణచివేతకు గురిచేసి, కేసులు పెట్టించి జైలుకు పంపిన చరిత్ర మర్చిపోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తిరిగి పార్టీలోకి రావడానికి నానా రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి స్వార్థ రాజకీయ నాయకులను తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, శంకర్‌యాదవ్, ధనరాజ్ గౌడ్, రమేష్‌నేత, జ్ఞానేశ్వర్‌యాదవ్, పెద్దవూర సైదులు, దుబ్బాక శేఖర్ పాల్గొన్నారు.

పార్టీ మారాల్సిన అవసరం సబితారెడ్డికి లేదు: అరవింద్‌శర్మ

ఎమ్మెల్యే సబితారెడ్డికి పార్టీ మారాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ అన్నారు. సోమవారం గ్రీన్‌హిల్స్ కాలనీలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లోకి సబితారెడ్డి మారుతున్నట్లు సోషల్ మీడియాలో, దిష్టిబొమ్మను దహనం చేయడం కాంగ్రెస్ దిగజారిన రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. పలు వేదికలపై తాను పార్టీ మారడం లేదని స్వయంగా సబితారెడ్డి వెల్లడించిన విషయం మరువరాదన్నారు. కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హితువు పలికారు. కేసీఆర్ సారథ్యంలో సబితారెడ్డి బీఆర్ఎస్‌లో కొనసాగుతారన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులకు అనుమానాలు, అపోహలు అవసరం లేదని పేర్కొన్నారు.



కళాశాల బస్సును తనిఖీ చేస్తున్న ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీసులు

పాఠశాలలు, కళాశాలల బస్సులను తనిఖీ చేసిన ఆర్‌టీఏ, ట్రాఫిక్ పోలీసులు

రామంతాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): హబ్సిగూడ చౌరస్తాలో సోమవారం వివిధ పాఠశాలలు, కళాశాలల బస్సులను ఆర్‌టీఏ, నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సుల ఫిట్‌నెస్‌ను పరిశీలించిన అధికారులు డ్రైవర్‌లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, ట్రాఫిక్ సీఐ డి.రాంబాబు, ఎస్ఐ జయనాథం, ఏఎస్ఐ వెంకటేశ్వర్‌రావు, ఆర్‌టీఏ ఎస్ఐ రజియా సిబ్బంది పాల్గొన్నారు.



ఉప్పల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న చిలుకానగర్ డివిజన్ బీజేపీ నాయకులు

రోడ్ల మరమ్మతులను చేపట్టండి

ఉప్పల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో అధ్వాన్నంగా మారిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతూ చిలుకానగర్ డివిజన్ బీజేపీ నాయకులు సోమవారం ప్రజావాణిలో ఉప్పల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. గుంతలమయమైన రోడ్లతో పాటు నిధులు మంజూరైనా ప్రారంభానికి నోచుకోని నూతన రోడ్ల పనులపై దృష్టిసారించాలని వారు కోరారు. బీజేపీ నాయకులు గోనె శ్రీకాంత్, రామరాజుయాదవ్, పోలోజు శ్రీనివాసచారి, బీరప్పగడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది

శానిటేషన్‌పై ప్రజలకు అవగాహన

మల్కాజిగిరి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బస్తీ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం మల్కాజిగిరి డివిజన్ లోని ఎల్బీ నగర్‌లో మల్కాజిగిరి కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్, జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది, అధికారులు కలిసి బస్తీలో పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ సంక్షేమసంఘం సభ్యులు శ్రీనివాస్, పారిశుధ్య సిబ్బంద యాదగిరి, సంతోషమ్మ, వెంకటేష్, బాలమణి, గిరి, సరిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, బీఈఎల్ అధికార సిబ్బంది

ప్రభుత్వ పాఠశాలకు బీఈఎల్ వితరణ

- రూ.15లక్షలతో అభివృద్ధి పనులు

కుషాయిగూడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) తమ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సంస్థ లాభాల్లో నుంచి రూ.15లక్షల నిధులను మీర్‌పేట్-హెచ్‌బి కాలనీ డివిజన్ పరిధిలోని రాజీవ్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ, నీటి సంపు, మరుగుదొడ్లు, ప్రధాన ద్వారం ఏర్పాటుతో పాటు మరమ్మతుల కోసం కేటాయించింది. ఈమేరకు సోమవారం అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో బీఈఎల్ అధికారులు కె.శ్రీనివాస్, సిహెచ్.విశ్వనాథన్, కందుకూరి రవి, స్థానిక కార్పొరేటర్ జె.ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేందర్ రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బుర్ర అపర్ణకు ఓయూ డాక్టరేట్



తార్నాక, జూలై 1 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలానికి చెందిన బుర్ర అపర్ణ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఓయూలోని భౌతికశాస్త్రం విభాగంలో డా. కలీం అహ్మద్ జలీలి పర్యవేక్షణలో నానో ఫైరట్స్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకుగాను డాక్టరేట్ పట్టాను అందుకున్నానని సోమవారం ఆమె తెలిపారు. బుర్ర అపర్ణకు డాక్టరేట్ రావడం పట్ల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, కుటుంబసభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణచారి తెలిపిన వివరాల ప్రకారం.. హుందా నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో 35 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతు డి శరీరంపై ఎరుపురంగు టీషర్టు, నీలిరంగు ట్రాక్ పాయింట్ ఉంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హైదర్‌నగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాంగ్‌రూట్‌లో ద్విచక్రవాహనం నడుపుతూ ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీలతరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తునికి చెందిన చిన్నారావు(40) కుటుంబంతో కలిసి నిజాంపేట్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పని నిమిత్తం కేపీహెచ్‌బీ కాలనీకి ద్విచక్రవాహనంపై రాంగ్‌రూట్‌లో రోడ్డు దాటుతుండగా ఉప్పల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఎదురుగా వెళ్లి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలు పాలైన చిన్నారావును స్థానిక లు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది జైలు

రాజేంద్రనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఇద్దరు నిందితులకు న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష, జరిమానా విధించింది. శంషాబాద్ ఆర్‌జీఐ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల ఈఎస్ఐ డిస్పెన్సరీలో గత ఏడాది సెప్టెంబర్ 28న చోరీ జరిగింది. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కాటేదాన్ బాబుల్‌రెడ్డినగర్ నివాసి సుమిత్ అలియాస్ సోనుసింగ్(33), సికింద్రాబాద్‌కు చెందిన అహ్మద్ జహంగీర్ మహమ్మద్(39) చోరీ చేసినట్లు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సోమవారం కేసు విచారించిన 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి జేవీఎస్ రాజ్‌కిరణ్ నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఇరువురి ఘర్షణ.. ఒకరికి కత్తిపోట్లు

రాజేంద్రనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్తూ ఒకరికొకరు గుద్దుకోవడంతో జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. లాల్‌దాబా ప్రాంతానికి చెందిన అబ్దుల్ నబీ(40), సల్మాన్ ఆదివారం రాత్రి ఒకే మార్గంలో వెళ్తున్నారు. ఇద్దరూ ఒకరికొకరు గుద్దుకోవడంతో గొడవ జరిగింది. దీంతో సల్మాన్ అబ్దుల్ నబీని కత్తితో పొడిచాడు. బాధితుడు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో సంఘటనలో..

ఆదివారం రాత్రి లాల్‌దాబా ప్రాంతానికి చెందిన మరో యువకుడిని సల్మాన్ గాయపర్చినట్లు తెలిసింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



ఏరియా ఆస్పత్రి రివ్యూ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందజేస్తాం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 1(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందజేస్తామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన రివ్యూ మీటింగ్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఆస్పత్రి ఆవరణలో నూతన బీటి రోడ్డు, లిఫ్ట్ సౌకర్యం, డయాలసిస్ సేవలు మెరుగుపర్చడం, మంచినీటి సౌకర్యం, కొన్ని చోట్ల డ్రైనేజీ పైప్‌లైన్ పగిలిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ లిఫ్ట్ సౌకర్యం గురించి ఇప్పటికే అధికారులచే మాట్లాడడం జరిగిందన్నారు. అదే విధంగా డయాలసిస్ సేవలు మెరుగుపరుస్తామని, నూతన మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీలను ఏర్పాటు చేసి ఆస్పత్రిని సుందరీకరణ చేస్తామన్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, డాక్టర్ హరిప్రియ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

చంపాపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): మూసానగర్ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ నందనవనంలోని మూసానగర్ ఉన్నత పాఠశాలలో సోమవారం కార్పొరేటర్ సుజాతానాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై 8,9వ తరగతులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో పదవ తరగతి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని వేరే చోటికి మార్చాలని హెచ్ఎం కోరినట్లు, పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతానాయక్, హెచ్ఎం ప్రభాకర్‌రావు, హనుమాన్ ఆలయ ధర్మకర్త శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, నాయకులు శశిధర్‌రెడ్డి, అందోజు సత్యంచారి, చంద్రశేఖర్‌రెడ్డి, డేరంగుల కృష్ణ, ఆదిలక్ష్మి, అనిత, నాగిరెడ్డి, నర్సింహ, సతీష్‌గౌడ్, మమత, మల్లేష్‌గౌడ్, భాస్కర్, మహేష్ పాల్గొన్నారు.



సీఆర్‌పీఎఫ్ పాఠశాల ఆవిర్భావ వేడుకలో సీఆర్‌పీఎఫ్ డీఐజీపీ అనిల్ మింజ్

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే సీఆర్‌పీఎఫ్ లక్ష్యం

- చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం
- సీఆర్‌పీఎఫ్ డీఐజీపీ అనిల్ మింజ్

జవహర్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఆర్‌పీఎఫ్ పాఠశాలల లక్ష్యమని డీఐజీపీ అనిల్ మింజ్ అన్నారు. సీఆర్‌పీఎఫ్ పాఠశాల ఆవిర్భావ వేడుకల సందర్భంగా పాఠశాల డిఐజీపీ, పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణలు మాట్లాడుతూ.. 28 ఏళ్లుగా పాఠశాలలో వేలాదిమది విద్యార్థులు చదివారని, ఎంతో మంది ఇప్పుడు ఉన్నతస్థాయిలో ఉన్నారని తెలిపారు. పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందన్నారు. విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మక వెలికితీయడంతో పాటు వారికి అన్ని రంగాలలో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామాన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అధికారులు పాఠశాల వైస్‌ప్రిన్స్‌పాల్ వెంకటరాజు, ఉపాధ్యాయులు ఆశాజిత్‌కుమార్, నవనీతణి, నూర్జహాన్. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

కుటుంబ కలహాలతో ప్లంబర్ ఆత్మహత్య

కొత్తపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నాగోల్ పీఎస్ పరిధిలో కుటుంబ కలహాలతో ప్లంబర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్‌హెచ్‌ఓ సుధీర్‌కృష్ణ కథనం ప్రకారం.. ఒడిషాకు చెందిన రాకేష్ మాలిక్(25) కొంత కాలంగా ఆనంద్‌నగర్ చౌరస్తాలో అద్దె గదిలో బావమరిది కైలాస్‌మాలిక్‌తో కలిసి ఉంటూ ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. అతడికి కుటుంబ కలహాలు ఉన్నాయి. సోమవారం ఉదయం అతడి బావమరిది కైలాస్ మాలిక్ కూలీ పనికి వెళ్లాడు. రాత్రి గదికి చేరుకుని చూసే సరికి రాకేష్ గది సీలింగ్ రాడ్‌కు టవల్‌తో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి..

జీడిమెట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వ్యాపారంలో నష్టం రావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓవ్యక్తి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆజ్‌బెస్టాజ్ కాలనీకి చెందిన సయ్యద్ దిల్‌వార్(31) వ్యాపారం సాగిస్తుంటాడు. ఇటీవల కాలంలో తన వ్యాపారంలో నష్టం రావడంతో తీవ్రమనస్తాపానికి గురయ్యాడు. గత నెల 30వతేదీ సాయంత్రం ఇంట్లోని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దిల్‌వార్‌కు భార్య, పిల్లలు ఉన్నారు.